సాక్షి పెద్దపల్లి

బుధవారం, 3, ఏప్రిల్, 2024



ముస్లింలకు అండగా ఉంటాం

గోదావరిఖనిటౌన్: ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. తిలక్‌నగర్‌లో ఇఫ్తార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ(సా.)	సహర్ గురు(ఉ.)
కరీంనగర్	6.27	4.39
పెద్దపల్లి	6.34	4.46
రాజన్న సిరిసిల్ల	6.34	4.46
జగిత్యాల	6.34	4.46

గరిష్ఠం/కనిష్ఠం
40.8/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నీటి సరఫరాకు అంతరాయం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ముర్మూర్‌లోని మిషన్ భగీరథ పంప్‌హౌస్ మరమ్మతులతో సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. మంగళవారం సరఫరా చేయాల్సిన ప్రాంతాలకు బుధవారం, బుధవారం సరఫరా చేయాల్సిన ప్రాంతాల్లో గురువారం తాగునీరు సరఫరా చేస్తామని ఆయన వివరించారు. నగరవాసులు నీటిని పొదుపుగా వినియోగించాలని ఆయన కోరారు.

నాణ్యమైన ధాన్యం తేవాలి

మంథని: రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏఎంసీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి శ్రీమాలతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. రైతులు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. విండో కార్యదర్శి అశోక్‌కుమార్, ఏఎంసీ కార్యదర్శి సతీశ్, వ్యవసాయాధికారి శ్రీకాంత్ ఉన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండ



చెక్కు అందిస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అభయం ఇచ్చారు. ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అకాల మరణం పొందిన టి.మధు కుటుంబానికి రూ.8లక్షల భద్రత చెక్కును ఆయన భార్య లత, కుమారుడు సాయిచరణ్‌కు సీపీ మంగళవారం అందజేశారు. ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసేలా చూస్తామన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, ఏవో అశోక్‌కుమార్, ఆర్ఐ(అడ్మిన్) దామోదర్, హోంగార్డు ఆర్ఐ మల్లేశం, పోలీసు అధి కారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం పాల్గొన్నారు.

'రక్షణయాత్ర'లో పాల్గొనండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఈనెల 2నుంచి 8వ తేదీ వరకు చేపట్టిన రాజ్యాంగ రక్షణయాత్రను విజయవంతం చేయాలని జాతీయ మాలమహానాడు జిల్లా కన్వీనర్ మాదాసు సతీశ్ కోరారు. యాత్ర ప్రచార పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో విడుదల చేసి మాట్లాడారు. సాంబశివరావు, చందు పాల్గొన్నారు.

పెరిగిన వేతనాలు

గోదావరిఖని: కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరిగినట్లు చీఫ్‌లేబర్ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. అన్‌స్కిల్డ్‌కు రూ.504 – రూ.522, సెమీస్కిల్డ్‌కు రూ.589 – రూ.610, స్కిల్డ్‌కు రూ.709 – రూ.734, హైస్కిల్డ్ కార్మికులకు రూ.832 – రూ.862 వరకు పెరిగాయన్నారు.

నిప్పును నియంత్రించేదెలా?



- ఇది మంథని అగ్నిమాపక కేంద్రంలోని బోరుబావి. దీనినుంచి వచ్చే నీళ్లు సిబ్బంది అవసరాలకే సరిపోతున్నాయి. ప్రమాదాలు, సంఘటన చోటు చేసుకుంటే.. బావులు, చెరువులు, కుంటల్ని ఆధారంగా చేసుకుని ఫైరింజిన్‌లో నీళ్లు నింపాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరిగింది. భూగర్భజలాలు అడుగంటాయి. చాలాప్రాంతాల్లో నీటి సమస్య నెలకొంది. అనూహ్యంగా అగ్నిప్రమాదం సంభవిస్తే పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది.



శివరాత్రి పండుగ నాడు పెద్దపల్లిలోని మొబైల్‌షాప్, పూజాసామగ్రి దుకాణాల్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చేలరేగాయి. క్షణాల్లో వ్యాపించి రెండు షాపుల్లోని సుమారు రూ.15లక్షల విలువైన వస్తుసామగ్రి కాలిబూడిదైంది. గతేడాది అగ్నిమాపక కేంద్రానికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలోని టపాసుల గోదాంలోనూ అగ్నిప్రమాదం జరిగింది. మంటల్ని అదుపులోకి తీసుకురాలేక ఇతర ప్రాంతాల్లోని ఫైరింజిన్లను తెప్పించాల్సి వచ్చింది.

- జిల్లాలో తీవ్రమైన నీటి సమస్య
- 14 మండలాల్లో మూడే అగ్నిమాపక కేంద్రాలు
- పరిధికి మించి సేవలు అందిస్తున్న అగ్నిమాపక ఉద్యోగులు, సిబ్బంది
- ప్రమాద సమయాల్లో తలెత్తుతున్న ఇబ్బందులు
- ఘటనా స్థలానికి చేరుకునేలోగానే బుగ్గిపాలవుతున్న ఆస్తులు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో చోటుచేసుకునే అగ్నిప్రమాదాలతో ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి. విలువైన వస్తువులు, సామగ్రి క్షణాల్లో కాలిపోతున్నాయి. అగ్నిమాపక కేంద్రాలు, సిబ్బంది కొరత ఒకవైపు, ప్రమాద స్థలానికి చేరుకునేందుకు రవాణా సౌకర్యం లేమి మరోవైపు అగ్నిప్రమాదాలను అరికట్టలేకపోతున్నాయి. మంథని ఫైర్‌స్టేషన్‌లో నీటికొరత ఉద్యోగులను వేధిస్తోంది. ఈ నియోజకవర్గం విస్తీర్ణంలో అతిపెద్దగా ఉండడం, ఇక్కడి నుంచి మారుమూల మండలాల్లో అగ్నిప్రమాదం జరిగితే సకాలంలో అక్కడకు చేరుకోలేకపోవడంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోతోంది.

50వేల మందికి ఒక ఫైర్‌స్టేషన్ ఉండాలి..

- జనాభా లెక్కల ప్రకారం జిల్లా జనాభా సుమారు 7.5లక్షలు ఉంది.
- అగ్నిమాపక శాఖ ప్రకారం 50 వేల జనాభాకు ఒక అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి.
- ఈ లెక్కన జిల్లాలో సుమారు 14 అగ్నిమాపక కేంద్రాలు ఉండాలి. కానీ, ఇప్పుడు మూడే ఫైర్ స్టేషన్లు ఉన్నాయి.
- దూరభారంతో అగ్నిమాపక యంత్రం సకాలంలో ప్రమాద స్థలానికి చేరుకోలేకపోతోంది.
- ఈలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.
- ఇరుకుదారుల్లోనూ ప్రమాద స్థలాలకు వేగంగా చేరుకునే బుల్లెట్ వాహనం ప్రస్తుతం ఫైర్‌స్టేషన్‌కు ఒక్కటే ఉంది.
- గల్లీలోకి సులువుగా వెళ్లి ప్రమాదాలను నివారించేందుకు దీనిని కేటాయించారు.
- అది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొస్తోంది. ఈలోగా ఫైర్ ఇంజిన్ అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దుతోంది.

అవగాహన లేమి..

వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకునే జాగ్రత్తలపై ఏటా ఏప్రిల్‌లో అగ్నిమాపక శాఖ వారం పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గోదాంలు, ఆస్పత్రులు, పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో ప్రదర్శనలు నిర్వహించాలి. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల్లోంచి రక్షించడం వంటి అంశాలపై విన్యాసాల ద్వారా అవగాహన కల్పించాలి. వీటిని పట్టణాల్లోనే చేపట్టడడంతో పల్లెల్లో అగ్నిప్రమాదాలను నియంత్రించలేకపోతున్నారు. పల్లెల్లోని గడ్డివాములు, గుడిసెలు అధికంగా ఉండటంతో ప్రమాద తీవ్రత పెరుగుతోంది. గ్రామీణులకు కూడా ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

ప్రతీ ఫైర్‌స్టేషన్‌లో 10మంది ఫైర్‌మెన్ ఉండాలి. కానీ, ఒక్కో అగ్నిమాపక కేంద్రంలో నలుగురి నుంచి ఐదుగురి సిబ్బంది కొరత ఉంది. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో అగ్నిప్రమాదాలు అధికంగా సంభవించే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. వాటిని ఎదుర్కొనేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రమాదాల నివారణ లక్ష్యం



అగ్నిప్రమాదాలు నివారించడానికి ప్రతీక్షణం అప్రమత్తంగా ఉన్నాం. వేసవిలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ప్రమాద నివారణ సూచనలు పాటించాలి. ఎక్కడ ప్రమాదం జరిగినా వెంటనే డయల్ 101కు కాల్‌చేసి సమాచారం, పూర్తి చిరునామా అందించాలి.

– శ్రీనివాస్, ఫైర్ ఆఫీసర్, పెద్దపల్లి

గత మూడేళ్లలో జరిగిన ప్రమాదాల వివరాలు

ఫైర్‌స్టేషన్	ఏడాది	ప్రమాదాలు	ఆస్తినష్టం(రూ.లలో)
పెద్దపల్లి	2021	55	30.13లక్షలు
పెద్దపల్లి	2022	61	1.84కోట్లు
పెద్దపల్లి	2023	62	7.01కోట్ల
గోదావరిఖని	2021	39	22.87లక్షలు
గోదావరిఖని	2022	61	39.01లక్షలు
గోదావరిఖని	2023	52	29.61లక్షలు
మంథని	మూడేళ్లలో	32	50లక్షలు

చమత్‌'కార్' నేత

- నియోజకవర్గ స్థాయి ఐదుగురు నేతలకు ఖరీదైన కార్లు ఇచ్చారట..!
- ఎన్నికల్లో సహకారానికి ముందస్తు తాయిలాలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికల పండుగొస్తే ఓటర్లకే కాదు.. నేతలకూ పంట పండుతోంది. పోలింగ్ ముందు రోజు ఓటర్లకు తాయిలాలు అందిస్తే, ఆయా నియోజకవర్గ స్థాయి నేతలకు కొంచెం ముందుగానే ఖరీదైన కార్ల రూపంలో బహుమతులు అందాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఓ ప్రధాన పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తన విజయానికి సహకరించాలంటూ, పార్లమెంట్ పరిధిలోని ఐదు నియోజకవర్గాల నేతలకు ఐదు కొత్త కార్లు గిఫ్ట్‌గా ఇచ్చినట్లు ఆ పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. పైగా, వారు ఒకేసారి కార్లు కొనడం గమనార్హం. విశ్వసనీయ సమాచారం మేరకు.. మొదట్లో తన అభ్యర్థిత్వానికి సహకరించాలని విన్నవించినా పెద్దగా ప్రతిఫలం కనిపించలేదు. దీంతో వారిని మచ్చిక చేసుకునేందుకు ముందుగా ఖరీదైన కార్లను బహుమతిగా ఇచ్చినట్లు తెలిసింది. అంతేకాదు, సదరు నేతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి పేర్ల మీదనే కార్లు తీసుకొని, వారి ఇళ్లకు చేర్చినట్లు సమాచారం. మున్ముందు అన్నివిధాలా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో సదరు నేతలు బెట్టువీడి ఎన్నికల్లో సహకరించేందుకు సమ్మతించారట. కొత్త కార్లకు తమతమ సొంతూళ్లలో పూజలు కూడా చేయించుకోవడం గమనార్హం. ఈ విషయం తెలిసి ద్వితీయ శ్రేణి నాయకులు సదరు నేత ఇంటి ఎదుట బారులు తీరుతున్నారట. మరి, సదరు చమత్‌కార్ నేత వీరందరినీ ఎలా సంతృప్తి పరుస్తారన్నది ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అవిశ్వాసాన్ని ఎదుర్కొనేందుకు ఓ బడా నేత ఖరీదైన కార్లను బహుమతిగా ఇచ్చిన ఘటనతో ఈ సంఘటనకు పోలికలున్నాయని పలువురు అంటున్నారు.

గోదావరిఖనిలో సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్

- ప్రారంభించిన రామగుండం సీపీ శ్రీనివాస్
- నేరుగా ఫిర్యాదు చేయాలని సూచన



పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖనిలో సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌ను సీపీ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ మోసగాళ్ల చేతిలో నష్టపోయిన వారు నేరుగా సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. సైబర్‌క్రైం బాధితుల వెలుసుబాటు కోసం ఈ అవకాశం కల్పించామని తెలిపారు. పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు, బాధితులకు సత్వర సేవలు అందించేందుకు సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌ను కమిషనరేట్ కార్యాయంలో అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. ఇందులో పర్యవేక్షక అధికారిగా ఏసీపీ వెంకటరమణ, సీఐ కృష్ణమూర్తి, ఒక హెడ్‌కానిస్టేబుల్, ఏడుగురు కానిస్టేబుళ్లు నిరంతరం సేవలు అందిస్తారని వివరించారు. కేసుల నమోదు, దర్యాప్తు, నేరస్తుల అరెస్టు వీరి విధి అని ఆయన అన్నారు. రూ.లక్ష నుంచి అంతకన్నా ఎక్కువ మోసపోతే ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుల ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని, రూ.లక్ష కన్నా తక్కువగా ఉన్న సైబర్ నేరాలపై సమీప పోలీస్‌స్టేషన్‌లోనే ఫిర్యాదు చేయాలని సీపీ చెప్పారు. బాధితులు వెంటనే 1930 నంబరుకు కాల్ చేయాలని, లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయొచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, సైబర్ క్రైం ఏసీపీ వెంకటరమణ, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ కృష్ణమూర్తి, స్పెషల్ బ్రాంచ్ సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ 10లోగా పనులు పూర్తిచేయండి




పెద్దపల్లిరూరల్: జూన్ 10వ తేదీలోగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల అభివృద్ధి పనులపై మహిళా సంఘాల సభ్యులు, అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుందన్నారు. గ్రామ సమైక్య అధ్యక్షులు, హెచ్ఎంలకు జాయింట్ చెక్‌పవర్‌తో బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలని సూచించారు. టాయిలెట్లు, తాగునీటి సరఫరాతోపాటు మైనర్ రిపేర్లను ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేయాలన్నారు. డీఈవో మాధవి, డీపీవో ఆశాలత, డీఆర్డీవో రవీందర్ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. అత్యవసరమైతేనే బయటకు రావాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇళ్లలోనే ఉండాలని సూచించారు. చిన్నారులు, వృద్ధులు ఇళ్లకే పరిమితం కావాలని అన్నారు.

నీడకు తరలించాలి.. మజ్జిగ తాగించాలి

- వడదెబ్బకు గురైతే ప్రాణాలకే ప్రమాదం
- వేసవిలో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలి
- 'సాక్షి'తో జీజీహెచ్ జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ అశోక్



డాక్టర్ ఎ.అశోక్

కోల్‌సిటీ(రామగుండం): భానుడు భగభగ మంటున్నాడు. సూర్యుడు సెగలు కక్కుతున్నాడు. ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40డిగ్రీల సెల్సియస్ దాటడంతో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీచేసింది. ఈ నేపథ్యంలో.. జిల్లావాసులు జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు వచ్చే ప్రమాదం ఉందని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ ఎ.అశోక్ తెలిపారు. వడదెబ్బ లక్షణాలు, నివారణ మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన 'సాక్షి'కి వివరాలు వెల్లడించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, చిన్నారులు, బాలింతలు ఎండ తీవ్రత అధికంగా ఉన్నసమయంలో ఇళ్లనుంచి బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచించారు. తప్పనిసరి పనులు ఉంటే డీహైడ్రేషన్‌కు గురవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన మాటల్లోనే..

సాక్షి: వడగాడ్పులంటే ఏమిటి? వడదెబ్బకు ఎలా గురవుతారు?

డాక్టర్: భరించలేని ఉష్ణతాపం, సాధారణ, గరిష్ఠ ఉష్ణోగ్రతలకు మించి నమోదు కావడం, ఎండలు అధికమై, వడగాల్పులు వీస్తే వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. వడదెబ్బ ప్రమాదకరమైనది. మెదడులో ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ పనిచేయక వడదెబ్బ బారినపడతారు. వ్యక్తి శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉంటే వడదెబ్బకు గురైనట్లు భావిస్తారు.

'సాక్షి': వడదెబ్బ లక్షణాలు ఏమిటి?

డాక్టర్: తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం, నాడీ వేగంగా కొట్టుకోవడం, నాలుక తడి ఆరిపోయి ఎండిపోవడం, శరీరంలో కనీస నీటి శాతం తగ్గిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకుంటారు.

'సాక్షి': వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన చికిత్సలు ఏమిటి?

డాక్టర్: వడదెబ్బకు గురైన వ్యక్తికి తక్షణం ప్రథమ చికిత్స అందించాలి. వెంటనే నీడకు తరలించాలి. చల్లని నీటిలో తడిపిన బట్టతో ఒళ్లంతా తుడవాలి. ఫ్యాన్, కూలర్, ఏసీ గాలి ఉంటే పెట్టాలి. దీంతో శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగించాలి. ఆ తర్వాత సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాలి.

'సాక్షి': వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?

డాక్టర్: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇంట్లో ఉన్నా, బయటకు వెళ్లినా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం లేదా, సాయంత్రమే పనులు పూర్తిచేసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు పట్టుకోవాలి. టోపీ, కూలింగ్ గ్లాస్ ధరించాలి. చేతిరుమాలు వెంట తీసుకెళ్లాలి. వాటర్ బాటిల్ ఉంచుకోవాలి. తరచూ నీరు బాగా తాగాలి. అవసరమైతే వీటితోపాటు ఉప్పు, పంచదార కలిపిన నీరు, మజ్జిగ తీసుకోవాలి. సీజనల్ పండ్ల రసాలు తీసుకోవాలి. కొబ్బరినీరు తాగాలి. కూల్‌డ్రింక్స్, శీతలపానీయాలు, ఐస్‌క్రీమ్‌లు నిషేధించాలి. తెల్లని దుస్తులు, లైట్‌కలర్ కాటన్ దుస్తులు ధరించడం మంచిది. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలి. గ్లోబల్ వార్మింగ్‌తో మానవాళి అనేక దుష్పరిణామాలను ఎదుర్కొంటోంది. భూమి వేడెక్కకుండా ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలి.

'రోడ్డు'న పడేయొద్దు

- ఏళ్లుగా ఒకేచోట వ్యాపారాలు చేసుకుంటున్నాం
- అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తాం
- ఉపాధికి ఆటంకం కలగకుండా రోడ్ల విస్తరణ చేపట్టండి

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని గాంధీచౌక్ చౌరస్తా నుంచి రీగల్ షూమార్ట్ కూడలి, మేదరిబస్తీరోడ్డు, ఓల్డ్ అశోక థియేటర్ మార్గంలో రహదారుల విస్తరణకు రామగుండం నగరపాలక సంస్థ, సింగరేణి యాజమాన్యం సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. తొలుత రోడ్లను ఆక్రమించిన షాపులు తొలగిస్తే విస్తరణ ప్రక్రియ ముందుకు సాగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈనేపథ్యంలోనే రోడ్లను ఆనుకుని ఉన్న సింగరేణి క్వార్టర్లు తొలగిస్తున్నారు. ఈ పనులు పూర్తయ్యాక కూల్చివేసిన సింగరేణి క్వార్టర్ల ప్రాంతంలో ప్రత్యేకంగా షెడ్లు నిర్మించి చిరువ్యాపారులను తరలించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈక్రమంలో వ్యాపారులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ భరోసా ఇస్తున్నారు. నగర అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు.

ఉద్యోగాలు లేవు. పొట్టకూటికోసం చిరు వ్యాపారం చేసుకుంటున్నం. మాతోపాటు మరికొందరు ఉపాధి పొందుతున్నరు. ఏళ్లుగా ఒకేచోట దుకాణాలు నడిపిస్తున్నం. రోడ్ల విస్తరణ పేరిట ఇప్పుడు వాటిని తొలగిస్తమంటున్నరు. అవిపోతే మా బతుకులు ఆగమవుతయ్. 15 రోజులుగా నిద్ర పట్టడంలేదు. నగర అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు. రోడ్ల విస్తరణకు సహకరిస్తం. కానీ మమ్మల్ని ఆదుకోండి.

– గోదావరిఖనిలోని చిరువ్యాపారుల ఆవేదన



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

న్యాయం చేయండి



రోడ్ల విస్తరణలో నష్టపోతున్న వ్యాపారులందరికీ ఒకేవిధమైన న్యాయం చేయాలి. అభివృద్ధికి సహకరిస్తాం. ప్రస్తుత స్థలంలోనే షెడ్లు కట్టించి ఇవ్వండి. ఆ తర్వాతే మా దుకాణాలు తొలగించండి. లేకపోతే మాతోపాటు మాపై ఆధారపడిన సుమారు 220 కుంటుంబాలు రోడ్డున పడుతాయి.

– గుంటి రాజేశ్, అధ్యక్షుడు, మొబైల్ షాప్స్ వెల్ఫేర్స్ అసోసియేషన్

షాపులు నిర్మించండి



ఓల్డ్ అశోక థియేటర్ ముందు మొబైల్‌షాపు నిర్వహించుకుంటూ ఉపాధి పొందుతున్న. రోడ్ల విస్తరణతో ఆందోళన చెందుతున్న. మా దుకాణాలను తొలగించాలని అధికారులు ఆదేశించారు. మేం ఉన్నచోటనే విస్తరణకు అనుగుణంగా కొత్త దుకాణాలను నిర్మించి మాకు అప్పగించండి.

– పింగిళి యుగేందర్, మొబైల్‌షాపు వ్యాపారి

ఆదుకోండి



కూల్చివేతలతో భయంగా ఉంది. 30ఏళ్ల క్రితం మా అమ్మానాన్న సోడాల బండి పెట్టి మమ్మల్ని సాదుకున్నరు. ఇదే అడ్డాలో మా తమ్ముడు వెంకటేశ్ బట్టలు అమ్ముంటే, నేను కుండలు విక్రయిస్తున్న. మమ్మల్ని షాపింగ్ కాంప్లెక్స్‌లోకి పొమ్మని చెబుతున్నరు. అక్కడ గిరాకీ ఉండదు. మమ్మల్ని ఆదుకోండి.

– వంగ రాజేశ్, కుండల విక్రయ వ్యాపారి

సహకరిస్తాం



ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పినట్లు రోడ్ల విస్తరణకు సహకరిస్తాం. 1991లో అప్పటి మున్సిపల్ చైర్మన్ సోమారపు సత్యనారాయణ రోడ్ల విస్తరణ చేసినప్పుడు 10 ఫీట్లు వెనక్కి వెళ్లినం. ఇప్పుడు మళ్లీ వెనక్కి వెళ్లాలంటున్నరు. మా ఉపాధికి నష్టం కలుగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు చూడాలి.

– వెంగల శ్రీనివాస్, పాన్‌షాపు

అందరికీ అండగా ఉంటాం



రహదారుల విస్తరణ, అభివృద్ధికి అందరూ సహకరించాలి. రోడ్ల విస్తరణలో దుకాణాలు కోల్పోతున్న వారికి అండగా ఉంటాం. వారికి అన్యాయం జరగకుండా చూసుకుంటాం. రోడ్లు బాగుంటేనే గోదావరిఖని వ్యాపార కేంద్రం మెరుగుపడుతుంది. ఆ దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

కేసీఆర్ పాలనలో ఒక్క ఎకరం ఎండలే..

- మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

మంథని: తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎక్కడా ఒక్కఎకరం పంట కూడా ఎండిపోలేదని మాజీ మంత్రి, ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంథని సమీపంలో నీళ్లు అందక ఎండిన పంటలను జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. కాంగ్రెస్ మూడు నెలల పాలన రైతులను కన్నీరు పెట్టిస్తోందన్నారు. పంటలకు నీళ్లిస్తామని భరోసా ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పంటలు వేశాక నీరు అందించడం లేదని, దీంతో పంటలు ఎండిపోయి రైతులకు నష్టం వాటిల్లిందని దుయ్యబట్టారు. అకాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు తమ ప్రభుత్వం పరిహారం చెల్లించిందని గుర్తుచేశారు. ఇదే పద్ధతిన ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేల చొప్పున రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. తాము ప్రతిపక్ష పోషిస్తుంటే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించడం విడ్డూరమని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. బిరుదు మల్లయ్య, శ్రీనివాస్ తమ 14 ఎకరాల్లోని పంట నీళ్లు అందక ఎండిపోయిందన్నారు. ఈసందర్భంగా రైతు కంటతడి పెట్టగా నాయకులు ఓదార్చారు. నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్, బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతును ఓదార్చుతున్న కొప్పుల ఈశ్వర్, మధు

క్లుప్తంగా

రేబీస్ లక్షణాలతో యువకుడి మృతి


అరుణ్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన మంకు అరుణ్(28) రేబీస్ లక్షణాలతో సోమవారం రాత్రి మృతి చెందాడు. ధర్మారం గ్రామానికి చెందిన మంకు శంకర్–వినోద దంపతులకు కుమారులు అరవింద్, అరుణ్, కూతురు అశ్విని ఉన్నారు. శంకర్ దంపతులు తమ కుమారుడు అరవింద్, కూతురుతో కలిసి నిజామాబాద్‌లో నివాసం ఉంటున్నారు. అరుణ్ ధర్మారంలోని నాయనమ్మ సాయవ్వ వద్ద ఉంటున్నాడు. కొంతకాలం వీఆర్‌ఏగా పనిచేశాడు. ఆ వ్యవస్థ రద్దు కావడంతో ఖాళీగా ఉంటున్నాడు. నెల రోజుల క్రితం నిజామాబాద్ వెళ్లగా అరుణ్‌తోపాటు మరికొందరిపై కుక్కలు దాడి చేశాయి. దీంతో అరుణ్ స్థానికంగా చికిత్స పొందాడు. 15రోజుల తర్వాత అరుణ్ తీవ్ర అస్వస్థతకు గురికాగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.15 లక్షల వరకు వెచ్చించారు. అయితే, చికిత్స పొందుతున్న అరుణ్ ఆరోగ్యపరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు..


శ్రీనివాస్ (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): కొత్తగట్టు గ్రామానికి చెందిన రామగిరి శ్రీనివాస్(30) ఆర్టీసీ బస్సు ఢీకొని మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రామగిరి మల్లయ్య–మణెమ్మ దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు శ్రీనివాస్ హనుమకొండలో ఉంటూ డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాడు. సోమవారం హైదరాబాద్ వెళ్లి వస్తూ హనుమకొండలో బస్సు దిగుతుండగా మరో బస్సు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుమారుడిని మంచి ఉద్యోగంలో చూడాలనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. కొడుకు మృతితో కన్నీరుమున్నీరుగా విలపించారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

కరీంనగర్ సిటీ: హైదరాబాద్‌లోని నాంపల్లి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో కరీంనగర్ ఎస్సారార్ కళాశాల హిందీ విభాగం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరు ఇటీవల 'సోషల్ మీడియాలో హిందీ భాష ఒక అధ్యయనం(వాట్సాప్, ఫేస్‌బుక్‌లకు ప్రత్యేకంగా)' అనే అంశంపై చేసిన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వరప్రసాద్ పర్యవేక్షణలో మహమ్మద్ ముజ్తబా, మహమ్మద్ ఆసిఫ్, షేక్ షర్ఫీల్, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, సర్దార్ మన్‌ప్రీత్ సింగ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టును వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య, స్టాఫ్ సెక్రటరీ ఎ.శ్రీనివాస్ విద్యార్థులను మంగళవారం అభినందించారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య
- భర్త రోకలి బండతో కొట్టి చంపాడన్న మృతురాలి బంధువులు
- జలపతి తండాలో ఘటన


శోభ మృతదేహం


మార్చురీ వద్ద మృతురాలి బంధువులు

చందుర్తి(వేములవాడ): అత్తింటి వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని దేవునితండా పంచాయతీ పరిధిలో జలపతి తండాలో విషాదం నింపింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లికి చెందిన శోభ (25)ను జలపతితండాకు చెందిన గుగులోతు జలంధర్‌కు ఇచ్చి, ఆరేళ్ల క్రితం పెళ్లి చేశారు. వివాహ సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. రెండేళ్లు వీరి దాంపత్య జీవితం ఎంతో అన్యోన్యంగా సాగింది. తర్వాత అదనపు వరకట్నం తీసుకురావాలంటూ భర్త వేధించడం మొదలు పెట్టాడు. భరించలేకపోయిన శోభ తీవ్ర మనస్తాపానికి గురై, సోమవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి, తనువు చాలించింది. మృతురాలి తల్లిదండ్రులు బానోతు శంకర్, హీరాల ఫిర్యాదు మేరకు ఆమె భర్త జలంధర్, మామ బాలు, అత్త ముని పారవ్వపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. శోభ మృతదేహానికి చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్ పంచనామా చేసి, పోస్టుమార్టంకు పంపించారు. కాగా, మృతురాలికి మూడున్నరేళ్ల కుమారుడు ఉన్నాడు.

భర్తే కొట్టి చంపాడని ఆరోపణ..

సోమవారం రాత్రి గుడుంబా తాగి ఇంటికి వచ్చిన శోభ భర్త జలంధర్ ఆమెతో గొడవకు దిగి చితకబాదాడని, అంతటితో ఆగకుండా ఇంట్లో నుంచి బయటకు నెట్టివేశాడని మృతురాలి బంధువులు ఆరోపించారు. మళ్లీ కొట్టేందుకు వస్తాడన్న భయంతో శోభ ఇంటి కి గడియ పెట్టి, పక్కనే ఉన్న గుడిసెలో తలదాచుకుందన్నారు. మూడేళ్లుగా భర్త వేధింపులతో మానసికంగా కుంగిపోయిన ఆమె అంతకుముందే పొలం వద్ద క్రిమిసంహారక మందు తాగిందని తెలిపారు. రాత్రి ఇంటికి చేరిన శోభను భర్త ఇప్పటివరకు ఎక్కడికి పోయావంటూ రోకలి బండతో కొట్టాడన్నారు. క్రిమిసంహారక మందుతోపాటు అతను కొట్టిన దెబ్బలకు తాళలేక మృతి చెందిందని పేర్కొన్నారు.

పోలీసుల బందోబస్తు

శోభ పుట్టింటివారు, బంధువులు ఆందోళనకు దిగుతారన్న సమాచారంతో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం గది వద్ద బందోబస్తు నిర్వహించారు. జలపతి తండాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

కల్లు తాగి ఆరుగురికి అస్వస్థత


బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడరూరల్: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో మంగళవారం ఉదయం కల్లు తాగిన ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే గమనించిన తోటి స్నేహితులు వారిని వేములవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ ఎస్‌ఐ మారుతి వెంటనే ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఎక్సైజ్ అధికారులు నూకలమర్రికి వెళ్లి కల్లును పరీక్షించి సీజ్ చేశారు.

ఒకరికి తీవ్ర అస్వస్థత

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూకలమర్రి గ్రామంలోని కల్లు మండువాలో పాలకుర్తి రవి వద్ద ఏడుగురు బూర్ల సురేశ్, గుగ్లోతు రాజు, సోమినేని శ్రీనివాస్, రోమాల తిరుపతి, భూక్య తిరుపతి, గుగ్లోతు రాజు, భూక్య ప్రకాష్ కల్లు తాగారు. వీరిలో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. బాధితుల్లో ఒకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కాగా ఏడుగురితో పాటు పాలకుర్తి రవి కూడా కల్లు తాగినట్లు తెలిసింది. కానీ ఇందులో ఇద్దరికి ఎలాంటి హానీ జరగలేదు.

కల్తీ కల్లే కారణమా?

కల్లు తాగడం వల్లే ఆరుగురు అస్వస్థతకు గురి కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోజూ నూకలమర్రి గ్రామంలో చాలామంది కల్లు తాగుతుంటారు. కానీ మంగళవారం ఒకే వ్యక్తి వద్ద బాధితులు కల్లు తాగడంతో అందులో ఏమైనా మత్తు పదార్థాలు కలిశాయా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లేదా ఎవరైనా కుట్రతో ఏదైనా కలిపి ఉంటారనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

విచారణ చేపట్టిన పోలీసులు

నూకలమర్రి ఘటనపై పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఘటనా స్థలానికి వెళ్లి కల్లు నమూనాలు సేకరించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్‌ఐ మారుతి బాధితులతో మాట్లాడి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కాగా, కల్లు తాగి ఆరుగురు అస్వస్థతకు గురికావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇది ఇలాఉంటే బూర్ల సురేశ్ అన్న రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు దొరికిన అభిలాష్ తల

- డీఎన్‌ఏ టెస్ట్‌కు పంపించిన పోలీసులు


క్రేన్ సహాయంతో బావిలోకి దిగుతున్న సీఐ స్వామి, ఎస్సై చేరాలు

తిమ్మాపూర్(మానకొండూర్): గత నెల 1వ తేదీన అదృశ్యమై, అదే నెల 27న బావిలో శవమై తేలిన మంథనికి చెందిన డిప్లొమా విద్యార్థి అభిలాష్ తల ఎట్టకేలకు దొరికింది. వారం రోజుల క్రితం మొండెం మాత్రమే లభించింది. ఒంటిపై ఉన్న దుస్తులు, సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులు అతన్ని గుర్తించారు. అయితే, తల దొరక్కపోవడంతో అభిలాష్ తల్లిదండ్రులు తిమ్మాపూర్ మండలంలోనే ఉంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం సాయంత్రం మండల కేంద్రానికి వచ్చారు. బాధితులతో మాట్లాడారు. తమకు న్యాయం చేయాలని వారు మంత్రిని వేడుకున్నారు.

మంత్రి ఆదేశాలతో గాలింపు చర్యలు

మంత్రి శ్రీధర్ బాబు వెంటనే రూరల్ ఏసీపీకి ఫోన్ చేసి, కేసు విచారణలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా విచారణ పూర్తి చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆదేశించారు. దీంతో వారు అభిలాష్ మృతదేహం లభించిన గవ్వ రవీందర్‌రెడ్డి బావిలోని నీటిని మంగళవారం మోటార్లతో తోడించారు. క్రేన్ సహాయంతో బావిలోకి దిగి, గాలింపు చర్యలు చేపట్టగా విద్యార్థి తల దొరికింది. తిమ్మాపూర్ సీఐ స్వామి, ఎస్సై చేరాలు డీఎన్‌ఏ టెస్టుకు పంపించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- చెరువులో మునిగి విద్యార్థి మృతి


ఉమామహేశ్ మృతదేహం

జగిత్యాల క్రైం: సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ విద్యార్థి చెరువులో మునిగి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని నాగేంద్రనగర్ కాలనీకి చెందిన రొడ్డ ఉమామహేశ్(14) 8వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లి వచ్చి, తన ఆరుగురు మిత్రులతో కలిసి జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె చెరువులో ఈతకు వెళ్లాడు. అందరూ కలిసి ఈత కొడుతున్న సమయంలో ఉమామహేశ్ నీటిలో మునిగిపోవడంతో మిగతా వారంతా ఒడ్డుకు వచ్చి కేకలు వేశారు. మత్స్యకారులు అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి, గాలింపు చర్యలు చేపట్టగా ఉమామహేశ్ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉమామహేశ్ మృతితో నాగేంద్రనగర్ కాలనీలో విషాదం నెలకొంది. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


అరుణ్ (ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎల్కలపల్లిగేట్ గ్రామానికి చెందిన ములుగుకుంట్ల అరుణ్(23) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్ కిరణ్ కథనం ప్రకారం.. అరుణ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. మనస్తాపానికి గురై, మంగళవారం ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో దూకాడు. మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'ఎస్సెస్సీ' మూల్యాంకనం నుంచి మినహాయింపునివ్వాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధుల నుంచి అనారోగ్య సమస్యలు, ఇతర కారణాలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపునివ్వాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈవో జనార్దన్‌రావును కలిసి, వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో ఎస్‌ఏ–2 పరీక్షల నిర్వహణ నిమిత్తం కనీసం నలుగురు ఉపాధ్యాయులు ఉండేలా చూసి, మిగతావారికి స్పాట్ విధులు కేటాయించాలన్నారు. 8 కిలోమీటర్ల కన్నా తక్కువ దూరంలో పనిచేస్తున్న టీచర్లకు ముందుగా స్పెషల్ అసిస్టెంట్ విధులు కేటాయించి, ఒకవేళ సరిపోకపోతే అంత కన్నా కన్న ఎక్కువ దూరంలో పని చేస్తున్నవారిని తీసుకొని, టీఏ, డీఏలు ఇవ్వాలని విన్నవించారు. ఉద్యోగ విరమణకు ఏడాదిలోపు ఉన్నవారిని, పీహెచ్‌సీ, న్యూరో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని మినహాయించాలన్నారు. రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సీనియార్టీ ప్రకారం కాకుండా రేషియో ప్రకారం విధులు కేటాయించాలని కోరారు. కనీసం మూడేళ్ల ఎస్సెస్సీ బోధన అనుభవం లేనివారిని, రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్నవారిని తీసుకోవద్దని పేర్కొన్నారు. నాయకులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సునీత, కృష్ణమూర్తి, రాజేంద్రప్రసాద్, కుమారస్వామి, ప్రతిభారాణి తదితరులున్నారు.

సిమ్స్‌లో ఇంటర్వ్యూలకు రండి

- నేటి నుంచి ఈ నెల 7వ వరకు నిర్వహణ
- 68 కాంట్రాక్టు పోస్టులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లో కొత్తగా 68 మందిని కాంట్రాక్టు ప్రాతిపదికన తీసుకునేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలుస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, వెనెరాలజీ, సైకియాట్రిస్ట్, రెస్పిరేటరీ మెడిసిన్, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, ఆప్తమాలజిస్ట్, ఆర్థోపెడిక్స్, ప్రసూతి మరియు గైనకాలజీ, రేడియాలజీ, అనస్తీషియా, డెంటల్, ఎమర్జెన్సీ మెడిసిన్ తదితర 22 విభాగాలకు చెందిన కోర్సుల్లో 23 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 14 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 31 మంది సీనియర్ రెసిడెంట్, ట్యూటర్, డిమోస్ట్రేటర్‌లను తీసుకుంటామని పేర్కొన్నారు. బుధవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిమ్స్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఎంబీబీఎస్ రిజిస్ట్రేషన్‌తోపాటు ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఎంఎస్, ఎండీ, డీఎన్‌బీ డిగ్రీ, స్పెషాలిటీ డిగ్రీ రిజిస్ట్రేషన్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు, పబ్లికేషన్‌ను చేరే సమయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులను తిరస్కరిస్తామని పేర్కొన్నారు.

రాజన్న సేవలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి


కోడె మొక్కు చెల్లించుకుంటున్న వంశీచందర్‌రెడ్డి కుటుంబసభ్యులు

వేములవాడ: రాజన్న ఆలయంతోపాటు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీ చందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి రాజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాజన్న గుడి అభివృద్ధిని విస్మరించిందని, ప్రస్తుతం విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలో రాజన్న ఆలయం, పట్టణం అభివృద్ధి పథంలోకి వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వేములవాడలో వ్యక్తి దారుణ హత్య

- మద్యం మత్తులో స్నేహితుడే చంపినట్లు అనుమానం


మహేశ్ (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

వేములవాడ: వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్‌కు చెందిన సిర్రం మహేశ్ (46) రెండేళ్లుగా భార్య పద్మ నుంచి దూరంగా ఉంటున్నాడు. మద్యానికి బానిసై, వేములవాడలో కూలీ పని చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. పట్టణంలోని భగవంతరావునగర్‌లో ఓ గది అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తితో స్నేహం కుదిరి, ఇద్దరూ కలిసి తరచూ మద్యం తాగేవారు. అయితే, సోమవారం రాత్రి మద్యం తాగిన తర్వాత ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో అవతలి వ్యక్తి మహేశ్ ముఖంపై సిమెంట్ రాయితో మోది హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. యజమాని శ్రీనివాస్ మంగళవారం అద్దె వసూలుకు రావడంతో మృతి విషయం బయటపడింది. పోలీసులకు సమాచారం అందించడంతో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, ఎస్సై అంజయ్య సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. అనుమానితుడిగా భావిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. మృతుడి భార్య ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్‌లో ఉంటున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఆమె నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

గంజాయి మాయమవడంపై ఆగ్రహం!

- సారంగాపూర్ ఠాణాను తనిఖీ చేసిన జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్
- నిందితులను పట్టుకునేందుకు 3 బృందాల ఏర్పాటు


సారంగాపూర్ పోలీస్‌స్టేషన్

జగిత్యాలక్రైం/సారంగాపూర్: సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏడాది కాలంలో అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంతో రెండు సంఘటనలు చోటుచేసుకున్నాయి. 2023 జనవరి 9న రాత్రి జగిత్యాలకు చెందిన వడ్డీ వ్యాపారి రేగొండ నరేశ్‌ను భద్రత నిమిత్తం ఠాణాలో ఉంచగా పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. తాజాగా పోలీస్‌స్టేషన్‌లో అంబులెన్స్‌లో భద్రపరిచిన గంజాయి మాయమవడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సంఘటన జరిగినప్పుడు విధుల్లో ఉన్న పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఠాణాలో సీసీ కెమెరాలు పని చేయడం లేదని గుర్తించినట్లు తెలిసింది. ఇక్కడి నుంచి పెంబట్లలోని పెట్రోల్ బంక్ వరకు కెమెరాలు లేకపోవడంతో నిందితులను గుర్తించడం కష్టతరంగా మారింది. ఇందుకోసం 3 బృందాలను ఏర్పాటు చేశారు. వారు అంతటా తనిఖీలు చేపట్టడంతోపాటు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

పోలీసుల అదుపులో అనుమానితులు?

పోలీస్‌స్టేషన్‌లో గంజాయి మాయమైన ఘటనపై విచారణ వేగవంతం చేయగా అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారు కొన్ని రోజులు ఠాణా ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరిగినట్లు సమాచారం.

11 మంది గంజాయి విక్రేతల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న గోదావరిఖని ఏసీపీ రమేశ్


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ రవి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గంజాయి విక్రయించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని గోదావరిఖని ఏసీపీ రమేశ్ హెచ్చరించారు. గంజాయి విక్రయిస్తూ పట్టుబడినవారి వివరాలను గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి టూటౌన్ ఎస్సై సనత్‌కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. న్యూమారేడుపాక చౌరస్తా వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద కిలో గంజాయి దొరికింది. నిందితులు యైటింక్లయిన్‌కాలనీ రాజీవ్‌నగర్‌కు చెందిన వల్లకాటి శశికిరణ్, రామగిరి మండలం పెద్దంపేటకు చెందిన రామగిరి ఈశ్వర్‌లను అరెస్టు చేశారు. అలాగే, కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు జూలపల్లికి చెందిన అనవేణ శ్రీనివాస్, ముక్కెర పవన్, అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, అద్దూరి దామోదర్, కొలిపాక రమేశ్, సుంకరి బాబు, చిప్పకుర్తి విష్ణు అరెస్టయ్యారు. వారి వద్ద నుంచి పోలీసులు కిలో గంజాయిని స్వాధీనం చేసుకొని, అరెస్టు చేశారు. పాలకుర్తి మండలంలోని ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, విక్రయిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. రెండు బృందాలతో గంజాయి విక్రయిస్తున్న వారిపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. గంజాయికి అలవాటుపడిన పిల్లల గురించి తల్లిదండ్రులు సమాచారం ఇస్తే కౌన్సెలింగ్ నిర్వహించి, వారు గంజాయి మానేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన టూటౌన్ సీఐ రవీందర్, కమాన్‌పూర్ ఎస్సై చంద్రశేఖర్‌లను అభినందించారు. టూటౌన్ రెండో సీఐ లింగమూర్తి, ఎస్సైలు వెంకటేశ్, సనత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి(ధర్మపురి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పెగడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మల్యాల సీఐ రవి సంబంధిత వివరాలు వెల్లడించారు. పెగడపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఆదిలాబాద్ జిల్లా బొప్పాపూర్‌కు చెందిన మెస్రం నగేశ్, జాకిర గూడకు చెందిన పెందుర్ లక్ష్మణ్ అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగ్‌లో చూడగా 2.2 కిలోల గంజాయి కనిపించింది. విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నా రు. దీంతో వారిని అరెస్టు చేసి, మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిసై విలువైన జీవితం పాడు చేసుకోవద్దని సూచించారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా గంజాయి నిర్మూలనకు నిఘా పెంచామన్నారు. గంజాయి క్రయవిక్రయాలపై పోలీసులకు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నిందితులను పట్టుకున్న ఎస్సై రామకృష్ణ, ఏఎస్సై సత్తయ్య, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అతి త్వరలో బీజేపీ ప్రజా మేనిఫెస్టో

- బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్


మాట్లాడుతున్న కుమార్, పక్కన ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను సేకరించి, అతి త్వరలో బీజేపీ ప్రజా మేనిఫెస్టోను విడుదల చేస్తామని మేనిఫెస్టో కమిటీ సభ్యుడు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వంటి కుటుంబ పార్టీల మాదిరిగా నాలుగు గోడల మధ్య మేనిఫెస్టోను రూపొందించబోమని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ఏ అంశాలుండాలో రైతులను అడిగి తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం కరీంనగర్‌లోని ఎంపీ బండి సంజయ్ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోవడం వల్ల వ్యవసాయం చేయడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు యువత, రైతుల అభిప్రాయం సేకరించామని, ఈ నెల 5లోపు కార్మికులు, మహిళల అభిప్రాయ సేకరణ పూర్తి చేస్తామన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, పార్టీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

అలరించిన 'అల్ఫోర్స్ సమ్మోహనం'





కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తిలోని అల్ఫోర్స్ హైస్కూల్ వార్షికోత్సవం అలరించింది. సీతారాంపూర్‌లోని శుభం గార్డెన్స్‌లో మంగళవారం ×అల్ఫోర్స్ సమ్మోహనం॰ పేరిట నిర్వహించిన వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ప్రతీ విద్యార్థి బాల్యదశ నుంచే మేధాశక్తిని పెంపొందించుకుంటూ ఎంచుకున్న రంగంలో ఉన్నతా స్థానంలో నిలవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యనభ్యసించే వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.